"గోవిందుడెవరండీ?" అనడిగా. "నాకు తెలీదే" అన్నారు ముద్దబ్బాయిలాగా. 'ఏ-గీ' అనకండి అని ఆయనమాట ఆయనకి అప్పజెపుదామనుకున్నా - కాని మనం ఆయనతో కాపురం జేయవలసినవాళ్ళం. ఆయన ఒంటికాలి మీద లేచినా మనం రెండుకాళ్ళమీదే నిలబడాలి అని కుమారీ శతకం నీతులుజ్ఞాపకం చేసుకుని, మనదేశం ఆర్థిక వ్యవస్థ చక్కబడి, స్త్రీ పురుష సమానత్వం ఏర్పడినపుడు, "ఏవే?" అంటే "ఏరా" అనొచ్చు మరీ బాగులేదనుకుంటే "ఏంవోయ్" అంటే "ఏంవోయ్" అనుకోవచ్చు అని సర్ది చెప్పుకున్నాను.

గోవిందుడెవరైనా ఆయన క్లాస్‌మేటా? లేక సాక్షాత్తు ఆ ఏడుకొండలవాడా? ఎవరికైనా అలాటి మారు పేరుందా? ఏమో ఏంచెప్ప గలం?

తరువాత ఎందుకైనా మంచిదని యిల్లంతా అక్కడిదిక్కడా యిక్కడిదక్కడా సర్ది కొంచెం చూడబుల్‌గా కొంపని తయారుచేసి మావార్ని బెల్లించి అడిగిచూశాను. పొద్దున్న "గోవిందుడొస్తాడు" అన్నారు కదా ఏవిటా గొడవ ఎవరతగాడు అన్నాను. అప్పుడాయన తొలిమంచు విడీ విడని సూర్యోదయంలా మొహం పెట్టి అన్నారు. గోవిందు డెవరో నాకూ తెలీదే నీతోడు - వస్తే వస్తాడు రాకపోతేరాడు అన్నారు. చాలా బావుందండీ అన్నా. ఆ బక్కెటో బెక్కెటో అన్నాయన జర్మనీలో ఓ నాటకం రాశాడ్ట - అందులో మావారిలాటి సోమరిపోతులే "గోడో" అనే ఒకాయన కోసం నిరీక్షిస్తూ చెట్టుకింద కూర్చుంటారట. అది రాసి నందుకు నోబెల్ బహుమతి యిచ్చారట. అది జూసి మావారు కూడా తనూ "గోవిందుడొస్తాడు" అని నాటకం రాద్దామనుకుని టైటిల్ మాత్రం సెలక్టు చేసుకున్నార్ట! బావుంది. హడిలి చచ్చానుకదండీ - యింకా ఆ గోవిందుడెవడో వస్తాడొస్తాడనుకుని నానా హైరానా పడిపోయాను. లేడీస్ అండ్ జంటిల్మెన్, మీకు గోవిందుడొస్తాడనే ఫీలింగ్ కలిగిందా లేదా-వస్తాడనే మీరూ అనుకుని వుంటారు. రానివ్వండి చితకాపతకా చింతకాయ పచ్చడి చేసేద్దాం!

# సువ్వరోపాఖ్యానం

"తాళలేనే - నే తాళలేనే

తాళలేనే ఓయమ్మా" అని పాడించేస్తున్నాయి ఈ ఎండలు - కవిత్వమొక తీరని దాహం అన్నాడుగాని కవి గుక్కుడు మంచి నీళ్ళివ్వకపోతే టక్కున చచ్చిపోయేట్లున్నాం మనం. కవులకుగాని, నాన్ కవులకుగాని ఎండల్ను భరించడం కష్టమే! కొందరు కవుల వచన కవిత్వంలాగ ఈ ఎండలు మండిపోతుంటే జరిగే పెళ్ళిళ్ళు జరిగిపోతున్నాయి. ఏం సుఖ పడుదామని ఈ ఏండల్లో వీళ్ళు తగుదునమ్మా అని పెళ్లిళ్లు చేసుకుంటారో అర్థంకాదు. ఈ

ఎండల్లో కాకపోయినా తరువాతేనా సుఖపడుదామనేమో వీరి ఆశ! పెళ్లిళ్లు చేసుకున్నవారంతా ఈ భూమ్మీద సుఖపడ్డం లేదని తెలిసీ పెళ్ళి చేసుకోవటం మానలేకుండా వున్నారు జనం.

"మదన తాపమూ, అధికమాయెనూ. మాటలేల యిక రమ్మనవే", అని మదన తాపము ఎక్కువయిన విరహిణులు తమ చెలికత్తెలతో గోల పెట్టుకుంటారట. చెలికత్తెల విరహం కూడా కథానాయకుడి ద్వారానే తీరుతుందో లేదో తెలియదు కాని ఎండలు లేకపోయినా కొందరాడవాళ్లు తాపానికి తలక్రిందులైపోయి తీరని బాధ లనుభవిస్తూ వుంటారు. హీటెక్కిపోయిన హీరోయిన్కి ఎండ చల్లగా వున్నట్లూ అదోరకమైన ఫీలింగు కలుగుతూవుంటుందంట. అంటేప్రేమ వడదెబ్బ కొట్టిందన్న మాట అమ్మాయిగారికి. గాడ్పులలో ప్రేమ వడగాడ్పులను కవుల అతిశయోక్తులతో కడు లబ్జుగా వర్ణించారు. మామూలుగా జ్వరం తగిల్తే కళ్లు మూసుకుని నిర్భోజనంగా పడుకుంటారు. ప్రేమ జ్వర తీవ్రత కలిగితే తాపోపశమనం అంతయారీఘగాకాదు. ఆ మదనతాపం ఎక్కువైన ప్రేమికులు చెట్లెక్కడం, గోడలు గోకడం, పిచ్చి చూపులు చూడటం, డూయెట్లు పాడడం లాంటివి చేస్తారు. వీటిని వర్ణించటం కవులకు హాబీ, కుట్టడం తేలుకి చెడ్డ సరదా అయినట్లు, లంజల్లారా ముంజెల్తినండని మా వూళ్ళో ముసలమ్మోహావిడ అరుస్తూ వుండేది. ముంజెల్తిన్నాక కొబ్బరి బొండాల్ని కొట్టి ఆ నీరు త్రాగటం నైసుగా తరిగిన మామిడి ముక్కల్ని ఐసులోవేసి వెండి చెమ్చాతో నోటికి, చేతికి అడ్డులేనట్లుగా తింటూవుంటే "ఎరమొ గిరమ్మొ తలపై ఒక దోసెడు మన్ను చల్లి సుందరి మెరువం గపోలములు దాచిన ముద్దులు దొంగిలించి శీధువాసము" అన్న పజ్యం గ్యాపకం వస్తుంది, అధర పానం అధరపానం అంటారుగాని కవ్వూ, మండుటెండల్లో మిట్టమధ్యాహ్నం శుభ్రమైన చెరకు రసాల్ని ఫ్రిజ్ లోంచి తీసి మూతగిల్లి క్రింద నొక్కుతూ రసం పీలుస్తూ వుంటే అధర సుధారసం కంటె యిది చీపూ రిస్కులేనిది, తవుజండ్ టైమ్స్ బెటరు అనిపిస్తుంది, చింతపండు పులుసులో యింత బెల్లం వుప్పూ వేసి అందులో ఐసు ముక్కలు వేసి చీకితే అది అధరామృతం కంటె బెస్టుగా వుంటుందని యిది హాస్టల్సులో స్టూడెంట్సుకి ఔన్సుల లెక్కన సప్లయిచేస్తే విద్యార్థి సమస్యలకు విరుగుడుగా పనిచేస్తుందని ప్రేమతత్త్వజ్ఞులుసెలవిచ్చారు.

చంటి పిల్లలు ఏడాది దాటిన పిల్లలు మామిడి పండు తింటుంటే చూడముచ్చటగా వుంటుంది. పొట్టనిండా మూతీ కళ్లూ చేతులూ తొడలూ అంతా రసం కారిపోతూ వాళ్లు ఆనందిస్తూంటే చూసేవారిజన్మ ధన్యం. కానివాళ్లు అత్తాత్తాత్తా అంటూ మన మీద దాడికొస్తే మనకది కంపరంగా వుంటుంది. తల్లికి మాత్రం చాలా యిబ్బంది. అందుకే రెండంటిస్తుంది వీప్మీద, ముద్దు తియ్యగా వుంటుందో లేదో తెలుసుకోవాలంటే ముందు చిన్న పిల్లల్ని ముద్దుపెట్టుకుని చూడాలి. పెద్ద వాళ్ళని ముద్దెట్టుకోవాలంటే అది హెవీ కష్టమవుతుంది. అన్యోన్యాన్ని, ఆపేక్షనూ ప్రదర్శించటానికి పశువులు మూతీ మూతీ రాసుకుంటాయి. ఒకదాని శరీరంతో మరొకదాని శరీరాన్ని రాసి త్రోసుకుని క్రిందపడి దొర్లుతాయి. ఫాదరీజ్ అనింపార్టెంట్. గొప్పంతా మదర్దే. అన్యోన్యానురాగాలను పక్షుల్ని చూసే మనం నేర్చుకుని వుంటాము. అవి

ఎగుర్తాయికదా గాలిలోను, మన కోర్కెలు కూడా అలానే ఎగుర్తోవుంటాయి. పక్షులలో ఏకపత్నీ వ్రతం కూడా వుందట.

ఈ ప్రేమ గాఢంగా ప్రయాణంచేసి మాతృత్వం దగ్గరకొచ్చి స్థాపవుతుంది. మొన్నీ మధ్యన మావారు బిక్క మొహం వేసుకుని వుస్సురుస్సు రంటూ వచ్చి దిగాలుగా కూర్చున్నారు. ఎండలో ఏదో జరిగి వుంటుంది. నెత్తిమీదేదైన పెట్టుకుని వెళ్లండని శతపోరుతూ వున్నాను. టోపీకాని గొడుగుకాని నల్ల కళ్లద్దాలుగాని ఆయనకు సిగ్గు. సిగ్గు చిమిడి నట్లే వుంది కాని వడదెబ్బ కొడుతుందని జాగ్రత్త అని వార్నింగిచ్చాను. ఇంతకీ ఆయనకు వడ దెబ్బ కాదట కొట్టింది. రోడ్డుమీద జరిగిన ఒక దృశ్యం తాలూకు ప్రభావం వలన ఆయన చింతా క్రాంతచిత్తులై డోలాందోళమానసులై వడదెబ్బ కొట్టిన వారి కంటే హీనంగా ఫీలవుతున్నారట. ఏమాకథ స్వామి అన్నాను. ఓ నమస్కారం పెట్టారు. నాకెందుకండీ అన్నాను. నీక్కాదే... ఆ పందికి అన్నారు. నాకు చెడ్డకోపం వచ్చేట్టుంది. పందెవరు, పందీ కుక్కానూ మతిగాని పోతోందా అని బ్రూ్కా యిచ్చాను.

అప్పుడు చెప్పారు రోడ్డు మీద వస్తుంటే ఒక పిల్లల పంది అజంతా హోటలు దగ్గర రోడ్డు దాటుతూండగా ఒక పిల్ల పందిమోకాళ్ళ మించి ఒక హెరాల్డు కారు దూసుకుని పోయిందట అప్పుడా పంది పిల్ల యాద్వలేక దీనంగా బాధతో గిలగిలా కొట్టుకుంటూ అర్చిందట ఇది చూసిన తల్లి పంది రోడ్డుదాటినదే ఆత్రంగా పరిగెత్తుకొచ్చి గోల చేస్తూ ఆ పిల్ల పంది చుట్టూ తిరుగుతూ ఏడుస్తోందట ఆ తల్లి బాధ చూడ్డానికి హృదయవిదారకంగా వుందట. తల్లి ఏమీ చేయలేదు. కాని బిడ్డ దురవస్థపట్ల అది వ్యక్తం చేసిన ఆవేదన చాలా గొప్పగా సుప్రీంగా వుందంటున్నారు మావారు. ఆ పందికి తన పిల్లల పట్లవున్న మమకారం మనుషుల్లో తోటి మనుషులపట్ల ఎందుకు కలుగటం లేదు? కంబోడియాలోకి సైన్యాన్ని పంపించిన నిక్సన్ను స్వయిన్ పిగ్ అన్నారంటే పిగ్‌ని ఎంత అవమానించారోకదా అని మావారు చాలా బాధపడ్డారు. వియత్నాంలో జరుగుతున్నదేవిటి? కంబోడియాలో జరుగుతున్నదేవిటి? పందిత్వం కంటే మానవత్వం ఎన్నో రెట్లు అధోగతిలో ఉంది.

పంది బురద మెచ్చు పన్నీరు మెచ్చునా అన్నారు. పంది పజ్యం యిలా రాయదు. దాని సిగ్గోసిరికాని – ఎండ ఏవీ సుఖంగా వుండదు. వుండకపోయినా కవులు దానిని వర్ణించకుండా వుండరు. బాధలూ కష్టాలూ మన కిష్టం లేకపోయినా కవులు వాటిగురించే రాస్తారు. లోకంలో సుఖం వున్నట్లే దుఃఖం వుంది. సుఖాన్ని అనుభవించినట్లే దుఃఖాన్ని కూడా అనుభవించాలి తప్పదు. ఈ లోకంలో అంతా దుఃఖమే ఉండి కొంచెం కూడా సుఖం లేనట్లయితే ఆ వున్న దుఃఖాన్నే పంచదార కోటా పంచినట్లు మనం అందరికీ పంచాలి. కాని లోకంలో ఎక్కువగా వున్న దుఃఖం గురించి కాకుండా తక్కువగా వున్న సుఖం గురించే చెప్పమంటారంతా. ప్రేయసి అంటూ లేనివాడికి దుఃఖం వుంటుందో లేదో మనకు తెలియదుగాని ప్రేయసిని కలిగివున్నవాడికి ఆమెతో ఎడబాటు దుస్సహంగానే వుంటుంది. అది లోక రివాజు. లేనివాడు లేక ఏడుస్తూంటే వున్నవాడు వుండి ఏడుస్తాడు ఈ లోకంలో నిండుకున్నటువంటి దుఃఖాన్ని తగ్గించటానికి

ప్రయత్నించటం మంచిదంటారా - మంచిదే మరైతే యుద్ధాలు అందుకే విధంగాను తోడ్పడవు. తల్లి గుణం ప్రేమించే గుణం యీ రెండూ లోపించిన తరువాత మనుషులు పందుల కంటె హీనంగా జీవిస్తారు.

పంది బురదమెచ్చు పన్నీరు మెచ్చునా అన్నారు. పందికి బురద అవసరం - పన్నీరు అవసరం లేదని కవులంతా తెలుసుకోవాలి. నిక్సన్‌ని పంది అని తిట్టకూడదు. అది చాలా తప్పు- బాంబులు తయారుచేసేవారి బాంబులు ఈ ప్రపంచాన్ని ఏల్తున్నంత కాలం బాంబులు ఎక్కడో ఒక చోట పడుతూ వుండాలి. ఇలా ఆలోచించి ఆలోచించి పంది గురించి బాధపడకండి సార్ లేవండి లేచి స్నానం చేసిరండి అన్నాను. మళ్లీ నమస్కారం చేశారు. బహుశా పందికే అయుంటుంది. నాకెందుకు చేస్తారు?

# ఆవకాయ మాహాత్మ్యం

"మానవత్వం - మామిడికాయ" అనే సబ్జక్ట్‌లో ఒక థీసిస్ రాసి ఆవకాయ డాక్టరేట్ కొట్టెయ్యాలనివుంది. లేకపోతే వాటీజ్ దిస్? ఆవకాయ పెట్టడం అనేది రాకెట్ ప్రయోగం కంటె డిఫికల్టాతి డిఫికెల్టయి పోయింది. మావారూ, నేనూ "టుబి ఆర్‌నాట్ టుబి" అన్న అవస్థలో పడ్డాం! ఆవకాయ పెట్టడమా, మానడమా, పెట్టడమా, మానడమా... దమదమ లాడిపోయింది. కచ్చా మేంగోస్ ముట్టుగుంటే ధర ప్రేలిపోతోంది. ఆవకాయ పెట్టడంకంటె చేతి బాంబులు తయారు చేయటం సింపులాతి సింపుల్ అనిపిస్తోంది. ఖర్చునేసరికి కొంచెం జారిపోయినట్టు కనిపించారు గాని మనిషి, ఖాళీ ఆవకాయజాడిని చూడగానే మళ్ళీ కరేజి పుంజుకుని పదండి ముందుకు పదండి తోసుకు పోదాం పోదాం బజారుకి అని బయల్దేరారు రవితేజములడరగ. ఆటల్లో చదరంగంలాగ. ఈగల్లో రాణీ ఈగలాగ, రాగాల్లో తోడిరాగంలాగ, యోగాల్లో భక్తియోగంలాగ, గాంధీల్లో ఇందిరాగాంధీలాగ, వూరగాయల్లో ఆవకాయ ఖింగ్-ఖింగ్ ఖింగే-సాంకేతిక పదజాలానికి ఇంగ్లీషుతో సాటిరాగల భాష లేదన్నారు. మరి ఆవకాయకు ఇంగ్లీషు ఉందీ. నోనో, పికిల్సుట పికిల్సు. ఆవకాయ మాంగో పికిల్సు అంటే మరి తొక్కుడు పచ్చడికేమంటారు? లాటిన్ భాషలో ఆవకాయకు సరైన పదంలేదు. అందాకా ఎందుకు మన దేశ భాష సంస్కృతములోమట్టుకు వుండేడిసిందా! "వెంకటేశ్వర మాహాత్మ్యం" అని సినిమా తీశారుకాని నన్నడిగితే "ఆవకాయ మాహాత్మ్యం" అని ఒక డాక్యుమెంటరీ విడుదల చేసుంటే ధణుతెగిరిపోయేది. ఒకావిడ ఆవకాయ జాడీ ప్లేన్‌లో ఎక్కించటానికి వీల్లేదంటే జెట్ ప్లేన్లోంచి సముద్రంలోకి దూకేస్తానందిట.

సత్యజిత్‌రాయ్‌కి ఒక చిన్న హార్లిక్స్ సీసాడు ఆవకాయ పంపిస్తే అతడింకా కళాఖండాలు ఘాటుగా తీస్తాడు. కష్టంలోగాని, సుఖంలోగాని ఒంటరిగా ఒక ఆవకాయ పెచ్చు ఎప్పుడూ